క్లుప్తంగా

పోషకాహారంతో ఆరోగ్యం

కడప ఎడ్యుకేషన్: పోషకాహారంతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని యోగివేమన విశ్వవిద్యాలయం ఫుడ్ టెక్నాలజి విభాగాధిపతి ఆచార్య రియాజున్నీసా అన్నారు. విశ్వవిద్యాలయం ఫుడ్ టెక్నాలజి విద్యార్థులతో కలసి ఆమె పెండ్లిమర్రి మండలం రామావురం, మిట్టమీదపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.. పిల్లలు ఎలాంటి ఆహార పదార్థాలు తినాలో చిత్రాల ద్వారా వివరించారు. జంక్ ఫుడ్ తినకూడదని తెలియ చేశారు. జంక్ ఫుడ్ వల్ల వచ్చే సమస్యలను చిన్నారులకు అర్థమయ్యేలా వివరించారు. వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా గ్రామీణులకు, పిల్లలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సమతుల్య ఆహారం గురించి తెలియ చేశారు. ఆహార పదార్థాలను వృథా చేయకూడదని తెలిపారు.

అన్నదానం



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన యువకులు తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంధుల ఉన్నత పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విష్ణువర్ధన్‌రెడ్డి, నిత్యానందరెడ్డి బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

తెలుగు భాష అమలుకు చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో తెలుగు భాష సంపూర్ణంగా అమలుకు చర్యలు తీసుకోవాలని, తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ను కలసి కోరారు. వైవీయూలో మొల్ల జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని కోరారు.

అభినందన



డా. సొహైల్ అహ్మద్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన డా. సొహైల్ అహ్మద్‌ను డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాక సురేష్ కుమార్, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఖలీల్‌బాష హాస్పిటల్‌కు వెళ్లి ఆయన ను అభినందించారు. డా. సొహైల్‌ను ఎస్‌ఈసీ సభ్యులుగా నియమించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్‌ఏ షంషీర్, ఫయాజ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బద్వేలు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 నుండి డీఆర్, 11వ పీఆర్సీ అరియర్స్, పీఆర్సీ తర్వాత రావాల్సిన నాలుగు డీఏ అరియర్స్‌ను మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, వీటి సాధన కోసం ఇప్పటికే ధర్నాలు, నిరసనలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. పెన్షనర్లు అందరూ ఐకమత్యంతో సమస్యలు సాధించేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు హనుమంతరావు, జిల్లా కోశాధికారి నాగేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, బద్వేలు పట్టణ ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

24న ఇంటర్వ్యూలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హెడ్ పోస్టాఫీసులో తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియమకానికి ఈనెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కార్యాలయ సూపరింటెండెంట్ జి.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, వేంపల్లె, మైదుకూరు, ముద్దనూరు తదితర ప్రాంతాల్లో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు చేయించుటకు ఏజెంట్లు కావాలని ఆయన పేర్కొన్నారు. కనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ప్రొద్దుటూరు తపాలా సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 24న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని సూచించారు. వివరాలకు 8498977463 నంప్రదించాలని తెలిపారు.

శ్రీ కృష్ణదేవరాయల పాలన ఆదర్శనీయం



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: శ్రీ కృష్ణదేవరాయలు పాలన స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, అన్నమయ్య జిల్లా పరిశీలకులు కె. సురేష్ బాబు అన్నారు. శుక్రవారం శ్రీ కృష్ణ దేవరాయలు వర్ధంతి సందర్భంగా క్రిష్టా సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తుమ్మలకుంట శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో రాయల విగ్రహానికి ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలతో కలిసి గజమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ భారత దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తుల్లో శ్రీ కృష్ణదేవరాయలు ఒకరన్నారు. రాయల పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నత స్థితికి చేరుకున్నదన్నారు. ఆంధ్రభోజుడిగా, సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా ఆయన కీర్తించబడ్డారన్నారు. దేవరాయలు వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో చెరువులు, కుంటలు, బావులు తవ్వించి నీటి పారుదల సౌకర్యం కల్పించారన్నారు. స్వయంగా కవి, పండితుడు కావడం వల్ల సంస్కృతంలోనూ, తెలుగులోనూ అనేక గ్రంథాలను రచించారని, రాయల ఆస్థానంలో అష్టదిగ్గజములుగా పేరొందిన ఎనిమిది మంది కవులు ఉండేవారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కడపలోని క్రిష్టా సర్కిల్‌ను సుందరంగా తీర్చిదిద్ది శ్రీ కృష్ణదేవరాయల సర్కిల్‌గా నామకరణం చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, నాయకులు తోటక్రిష్ణ, ఐస్‌క్రీం రవి, రమేష్‌రెడ్డి, రెడి ప్రసాద్, ఎస్. బాదుల్లా, సింధేరవి, సుదర్శన్ రాయల్, సింధు, సీహెచ్ వినోద్, షంషీర్, అక్బర్, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, బి. మరియలు, మల్లీశ్వరి, సుజిత, పద్మ, శివమ్మ, పాల్గొన్నారు.

కృష్ణదేవరాయలకు ఘన నివాళి

కడప కోటిరెడ్డిసర్కిల్ : శ్రీకృష్ణ దేవరాయలు వర్ధంతిని పురస్కరించుకుని కడపకు చెందిన బలిజ ప్రముఖులు శుక్రవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. నగరంలోని కృష్ణా సర్కిల్‌లోగల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి వారు పూలమాల వేసి ఆయన ఘనతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముగ్గురాళ్ల అమరప్ప, శ్రీనివాస విద్యాసంస్థల అధినేత శ్రీనివాసులు, టీడీపీ నేత హరి ప్రసాద్, జనసేన నాయకుడు సుంకర శ్రీనివాసులు, రమణ, కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణ స్వామి రాయల్, కార్పొరేటర్ సుబ్బారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి చంద్ర శేఖర్, శివారెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, ఎద్దుల శంకర్, శంకర్ రెడ్డి, నగినాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక బలం విజయ మార్గం

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల విజయ మార్గం వారి మానసిక బలంపై ఆధారపడి ఉంటుందని సైకాలజిస్టు ఓ. వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పిల్లల మానసిక స్థిరత్వం విజయానికి మార్గం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విజయ మార్గం వారి మానసిక బలంపై ఆధారపడి ఉంటుందని స్పష్టంగా పేర్కొన్నారు. చదువులో మెరుగైన ఫలితాలు సాధించాలంటే విద్యార్థులు తమ భావోద్వేగాలను సమర్థంగా నియంత్రించుకోవాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారని, అలాంటప్పుడు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా వారు ఏదైనా సాధించగలరని చెప్పారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ మెంటర్ వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను పొందేలా చేయడంలో జేకేసీ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. కె. మంజుల మాట్లాడుతూ జేకేసీ అనాలిటికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎక్సెల్, పవర్‌పాయింట్, ఇంటర్నెట్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చి, విద్యార్థులను ఉద్యోగానికి సిద్ధం చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా, ఎస్ఐపి కోఆర్డినేటర్ డా. కె. ప్రకాష్ నారాయణ రెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా. సి. వి. కృష్ణవేణి, డా. గురుమోహన్ రెడ్డి, కుమార్, ఆశలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

కమలాపురం: పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబ్ సుబహాని, ఖుత్‌బే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిరిస్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దస్తగిరి స్వామి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ మహమ్మద్ ఫైజుల్ గప్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండా ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపు పట్టణంలోని పురవీధుల గుండా మేళ తాళాలతో దర్గా చేరుకుంది. ఊరేగింపు అనంతరం గంధం ఎక్కించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ తెలిపారు. మండలంలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం టెక్నో హోలిక్స్ 2కె25 (నేషనల్ లెవెల్ సింపోసియం) నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఈవెంట్లలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, కళాశాల వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో సీపీఆర్‌తో బతికించవచ్చు

సిద్దవటం : మనిషి ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు సీపీఆర్‌తో మనిషిని బతికించవచ్చునని సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలిపారు. సిద్దవటం మండలం పొన్నవోలు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంటిగారిపల్లి గ్రామంలో వైద్యురాలు డాక్టర్ రంగలక్ష్మి, సిద్దవటం సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సీపీఆర్ (హృదయ శ్వాస పునరుద్ధరణ), ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగటిగారిపల్లె గ్రామ ప్రజలకు ఆరోగ్య కేంద్ర వైద్యురాలు మనిషి గుండె ఆగిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు సీపీఆర్ చేయడం వల్ల చాలా వరకు ఒక మనిషి ప్రాణాన్ని బతికించవచ్చునని సీపీఆర్ ఎలా చేయాలో చూపించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి గ్రామంలోని ప్రజలకు మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, ఫైలేరియా గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్ మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఏఎన్ఎం కృష్ణమ్మ, ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్త సువర్ణ, 104 సిబ్బంది, అంగన్వాడీ వర్కర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలబాలికలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూలులో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ బాలల సమస్యలు, ఆరోగ్యం, విద్య, వైద్యం , సంక్షేమం తదితర అంశాలపై సమస్యలు వస్తే ఎవరిని సంప్రదించాలి? ఎవరికి తెలియజేయాలి తదితర విషయాలను తెలుసుకుని ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్ మాట్లాడుతూ పిల్లలకు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఒక బాక్సును ఏర్పాటు చేసి వాటి ద్వారా స్వీకరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని మాట్లాడుతూ బాలలంటే ఎవరు? ఏ వయస్సు వారిని బాలలు అంటారు తెలియజేసి బాల్య వివాహాలు, బాలికా విద్య ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అలాగే టోల్‌ఫ్రీ నెంబరు 1098, 112, 100, 108, 181పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌సీపీఓ సునీతరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, రాఘవరెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ విభాగపు సిబ్బంది కృష్ణ ప్రతిరూప్, యూనుస్‌బాష, ఓఎస్‌సీ సిబ్బంది మానస, సునీత, ఉమ పాల్గొన్నారు.

బీసీ భవన్‌లో మౌలిక వసతులు కల్పించండి



బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్: కడప నగరం పాతరిమ్స్‌లో ఉన్న బీసీ భవన్‌కు మౌళిక వసతులు కల్పించాలని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. శివరామ్ కోరారు. శుక్రవారం జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు బీసీ నేతలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.6కోట్ల నిధులతో పాత రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో మూడంతస్తుల భవనం నిర్మించారన్నారు. అందులో గ్రౌండ్ ఫ్లోర్, పార్కింగ్, డైనింగ్, మొదటి అంతస్తు ఫంక్షన్ హాల్, రెండవ అంతస్తులో బీసీ స్టడీ సర్కిల్ క్లాస్ రూమ్, మూడవ అంతస్తులో 12 రూములు నిర్మించారు.. కానీ అందులో ఫర్నిచర్, లైబ్రరీ, పుస్తకాలు, కంప్యూటర్లు, డైనింగ్ టేబుల్స్, మంచాలు, సోఫాలు, రీడింగ్ రూమ్‌కు కుర్చీలు టేబుల్స్, ఫ్యాన్లు ఏసీలు లేకపోవడం వలన కార్యక్రమాలు జరుపుకొనుటకు ఇబ్బందిగా ఉందన్నారు. బీసీల పార్టీ బీసీల ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి నేతలు, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచిన బీసీ భవన్ అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. దీన్ని బట్టే బీసీలపై ఎంతటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని విమర్శించారు. ఇప్పటికైనా ఈ విషయాలను ప్రభుత్వానికి విన్నవించి నిధులు మంజూరు చేయించి, కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శివయాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు నరస్య, రమణ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజయవాడలోని విద్యుత్ సౌధా దగ్గర జరుగుతున్న చర్చలు విజయవంతం కావాలని వారికి మద్దతుగా ఏపీ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నగరంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పి సుదర్శన్ రెడ్డి, యూనియన్ డిస్కం అధ్యక్షులు ఎస్. శివశంకర్, కాంట్రాక్టు యూనియన్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని పార్టీల ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా చట్టాలు మారుతున్నప్పుడు, కార్మిక వర్గం కోసం చట్టాలు మార్చాలన్నారు. సంస్కరణల పేరుతో ఇష్టానుసారం జేఎల్ఎం గ్రేడ్ 2 లని, డేటా ఎంట్రీ ఆపరేటర్లని, రకరకాల పేర్లు, రకరకాల స్కేళ్లలో యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ప్రైవేటీకరణలో భాగంగా జరుగుతున్నాయన్నారు. కార్మిక, ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేంద్ర ,శివకుమార్, నాగ మల్లయ్య, రియాజ్, బండి రామ్మోహన్, పిసి కొండయ్య, నరసింహులు, గోపి, రవికుమార్, చెన్నకృష్ణ, బాష తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్



శక్తి యాప్‌ను చూపుతున్న విద్యార్థులతో శక్తి టీం మహిళా ఎస్ఐ శాంతమ్మ

కడప ఎడ్యుకేషన్: శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం అని శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరశివార్లలోని అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు ఇంజనీరింగ్ కళాశాలలో 'శక్తి' యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి టీమ్ మహిళా ఎస్.ఐ శాంతమ్మ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణతోపాటు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఎస్ఓఎస్ బటన్ డయల్ 112 నెంబర్‌కు కాల్ చేస్తే కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకుని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. అలాగే మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100,112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు అత్యవసర సేవల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, హెచ్ అండ్ ఎస్ కోఆర్డినేటర్ శిరీష, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..?



బైపాస్ రోడ్డులో ఏర్పడిన గుంతలను చూపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: అలంఖాన్ పల్లి బైపాస్ నుండి రిమ్స్ పోయే దారిలో ప్రమాదకరంగా రోడ్డుకు గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, మరమ్మతులు చేయాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ తెలిపారు. శుక్రవారం ఆ మార్గంలో ఏర్పడిన గుంతలను డీవైఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డు మార్గాన వెళుతుంటాయని, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. ఇలా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు ఈ సమస్య పరిష్కరించాలన్నారు.

మహిళా రైతులకు శిక్షణ

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం పండ్లు,కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తులపై స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ పండ్లు, కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తులు, వాటి ప్రాముఖ్యత, మార్కెటింగ్ సదుపాయాలు, యాంత్రికరణపై తెలియజేశారు.
గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ మాట్లాడుతూ ఉద్యాన ఉత్పత్తులైన మామిడి, టమాటా, మిరప, మునగ ఉత్పత్తుల తయారీ విధానం, నిల్వ, ప్యాకింగ్ గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ ఉద్యాన పంటల విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి, పశు వైద్య విభాగం శాస్త్రవేత్త విజయనిర్మల పాల విలువ ఆధారిత ఉత్పత్తులైన నెయ్యి, జున్ను, కోవా గులాబ్ జామున్ గురించి తెలిపారు. కార్యక్రమంలో మహిళా రైతులకు కూరగాయలు, పండ్ల మొక్కల విత్తనాలను పంపిణీ చేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కడప ఎడ్యుకేషన్: చెట్ల పెంపకంతో పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు అన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా శుక్రవారం నగరంలోని రైల్వేకాలనీ, మేరీ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల పెంపకంతో మనకు కావాల్సిన ఆక్సిజన్‌తో పాటు ఇంధనం, వర్షాలు, పర్యావరణ పరిరక్షణ అందుతుందన్నారు. చిన్నారులు తమ తల్లిదండ్రులతో మొక్కలను నాటించాలని సూచించారు. ప్రతి మనిషి ఒక మొక్క నాటితే పర్యావరణాన్ని రక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్‌తోపాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య జీవితం అత్యంత కీలకం

కడప ఎడ్యుకేషన్: బాల్య జీవితం అత్యంత కీలకమని ఆ సమయంలోనే భాషా నైపుణ్యం, సృజనాత్మకత, సంభాషణ ప్రతిభను అభివృద్ధి చేయాలని వైవీయూ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సు డీన్ ప్రొఫెసర్ దాము అన్నారు. కడపలోని హరిత హోటల్‌లో నారాయణ విద్యాసంస్థల ఎంటీసీ గ్రాండ్ ఫైన్ సీజన్-6 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎండీ హెడ్ భారతి, కడపజిల్లా ఏజీఎంలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాము మాట్లాడారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా పార్థసారధి, వైశాల్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ గీతా, కల్పనలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ

కడప అగ్రికల్చర్: జీవన ఎరువులు వాడాలని కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సికెదిన్నె మండలం ఇప్పపెంటలో జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ నేల నుంచి సంక్రమించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త మహేష్‌బాబు, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమైర్ జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాష, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ ఉమైర్ జన్మదిన వేడుకలు ఎన్ఆర్ఐల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాష, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం లు ముఖ్య అతిథులుగా హాజరై ఉమైర్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమైర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో చేసుకోవాలని, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అంకిత భావంతో పనిచేసి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, గయాజ్ , కువైట్ కో కన్వీనర్ కావేటి రమణ యాదవ్, వర్కింగ్ కమిటీ సభ్యులు పోలి గంగిరెడ్డి, ఎన్ఆర్ఐలు భాస్కర్ రెడ్డి, షేక్ ఇలాహి, ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు బాబు బాయ్, ఇన్వయాత్, ఫైరోజ్, ఫారూఖ్, అక్బర్, జమాల్‌బాషా, షంషీర్, షఫీ, జిలాన్, అజ్మతుల్లా పాల్గొన్నారు.

బదిలీ టీచర్లను రిలీవ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు జూన్ నెలలో ముగిసినప్పటికీ కొన్ని వేల మంది ఉపాధ్యాయులు ఇప్పటికీ రిలీవర్లు లేక అలాగే కొనసాగుతున్నారని, వారందరిని బదిలీ పొందిన పాఠశాలలకు రిలీవ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టీయూ సంఘ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ 2025 డీఎస్సీ నూతన ఉపాధ్యాయుల నియామకాల అనంతరం అయినా బదిలీలు పొంది రిలీవ్ కాని ఉపాధ్యాయుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందనుకున్నామన్నారు. నూతన ఉపాధ్యాయులకు ప్రకటించిన ఖాళీల వివరాల తర్వాత బదిలీ ఉపాధ్యాయులను పాత పాఠశాలల నుంచి రిలీవ్ అయ్యేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ రెడ్డి ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కే సురేష్ బాబు, కే బాలగంగి రెడ్డి, కొండాపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.